

పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి వారి రథోత్సవం



రథోత్సవానికి ఉత్సవమూర్తులను తీసుకెళుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఎంపీ వంగా గీత

శివోహం

- పాదగయకు రెండో రోజూ పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో లింగోద్భవ అభిషేకాలు
- వైభవంగా కుక్కుటేశ్వరస్వామి రథోత్సవం



పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తుల కోలాహలం

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజూ భక్తుల తాకిడి కొనసాగింది. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున లింగోద్భవ పూజల అనంతరం భక్తులు ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరారు. ఈ సందర్భంగా కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి లక్షకుంకుమార్చన, లక్షచామంతి పూజ చేశారు. ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణంలో వీధులు కిటకిటలాడాయి. లింగోద్భవ పూజలను పురస్కరించుకుని స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేత్రపర్వం.. రథోత్సవం

భక్తితో కోరినంతనే కరిగిపోయి, కరుణించే ఆ భక్తవశంకరుడు.. దేవేరితో కలసి.. రంగురంగుల సుగంధ భరిత పూలమాలలు, విద్యుద్దీపాలతో అలంకరించిన రథంపై కొలువుతీరి.. తమ చెంతకే వచ్చిన వేళ.. ఆ స్వామి, అమ్మవార్లను దర్శించిన వారు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పిఠాపురంలో రాజరాజేశ్వరీ సమేత శ్రీ ఉమా కుక్కుటేశ్వరస్వామి రథోత్సవాలు శనివారం కన్నుల పండువగా జరిగింది. పిఠాపురం పాదగయ క్షేత్రంలో తెల్లవారుజామున పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ పేరిట అర్చకులు లింగోద్భవ పూజలు చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పాల్గొన్నారు. తొలి అర్చన అనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్త జనసందోహం నడుమ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పట్టు వస్త్రాలు, నగలతో అలంకృతులైన స్వామి, అమ్మవార్లు రథంపై కొలువు తీరగా.. ఈ ఉత్సవాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వేద పండితులు ప్రారంభించారు. మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ బ్యాండు మేళాల ఘోషతో సాగిన ఈ రథోత్సవంలో అశేష భక్త జన వాహిని పాల్గొని, రథాన్ని లాగి, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కుక్కుటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకాలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

అన్నసమారాధన

కొత్తపల్లి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మూలపేటలోని కేదారేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం చేశారు. కొత్తమూలపేట, రామన్నపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

సామర్లకోట: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రతిపాడు రోడ్డులోని జగనన్న కాలనీ నుంచి వైఎస్సార్ సీపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభిస్తున్నట్లు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం సాయంత్రం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరు

- 29 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- పెద్దాపురం ఆర్డీవో వార్నింగ్

పెద్దాపురం: డివిజన్‌లో ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైన 29 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు వెల్లడించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్, ఇతర అధికారులకు శనివారం పోలింగ్ సరళి, ఈవీఎంల పని తీరుపై రెండు విడతలుగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామారావు మాట్లాడుతూ, ఎన్నికల్లో నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఓటు వేసే విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ గురవుతున్నాయన్న అపోహలు తొలగిపోయేందుకు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో సూచించారు. అనంతరం ఈవీఎంల పని తీరు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ అధికారుల విధులు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, సుమారు 420 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎంల పని తీరుపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఆర్డీవో రామారావు

కోలాహలం.. రథోత్సవం

- బాలాత్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామిని దర్శించిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భారీ ఎత్తున పోలీసు బందోబస్తు



సామర్లకోటలోని భీమేశ్వరస్వామి రథోత్సవంలో దొరబాబు, రాజప్ప తదితరులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి రథోత్సవం పట్టణంలో కోలాహలంగా జరిగింది. శనివారం సాయంత్రం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ జిల్లా పరిషత్తు విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. గోదావరి కాలువ అవలివైపు ఉన్న ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిపై బాణసంచా కాల్పుల మధ్య రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్ సెంటర్‌కు తీసుకువచ్చారు. వేద మంత్రాల నడుమ, పూలతో, విద్యుద్దీపాలంకరణలో ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి పూజలు చేశారు. రథం ఎదురుగా ఏర్పాటు చేసిన కుంభం మీదుగా రథాన్ని కదిలించారు. గాంధీచౌక్ నుంచి పెద్దవీధి, బళ్లమార్కెట్ సెంటర్, గొల్లగూడెం, నీలమ్మ చెరువు, దేవీచౌక్ మీదుగా తిరిగి గాంధీచౌక్‌కు రథోత్సవం చేరింది. రథం సాగిన మేర భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. రథానికి ఏ ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోలసంబరం, వీరభద్రుని సంబరం, గోవింద గోవింద నృత్యం, మ్యూజికల్ బ్యాండ్, కోబ్రా నృత్యం, తీన్‌మార్, రేణుక ఎల్లమ్మ, శివుని బొమ్మ, డాల్స్, పొడుగు కాళ్ల ప్రదర్శన, హనుమంతుని వేషం తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా పరిషత్తు విభాగపు జిల్లా అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కౌన్సిలరు సేపెని సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, నెక్కంటి సాయిప్రసాద్, ఈఓ బళ్ల నీలకంఠం, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, గోలి వెంకటఅప్పారావుచౌదరి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, ఉత్సవ కమిటీ సభ్యులు యండమూరి సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మీ, చల్లా కుమారి, కౌన్సిలర్లు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న భక్తుల తాకిడి

స్వామివారి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి కొనసాగింది. ఉత్సవాల అధికారి అల్లు వెంకట దుర్గాభవాని, ఈఓ బళ్ల నీలకంఠంల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



చంద్రశేఖరస్వామి రథోత్సవాన్ని ప్రారంభించిన దొరబాబు తదితరులు



సామర్లకోట రథోత్సవంలో గోపాల నృత్యం

భక్తి శ్రద్ధలతో చంద్రశేఖరస్వామి రథోత్సవం

స్థానిక పాత సామర్లకోటలోని బాలత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం రథోత్సవం జరిగింది. నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు హాజరై మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 6వ తేదీన స్వామి వారి కల్యాణం జరగగా మహాశివరాత్రి మరుసటి రోజున రథోత్సవం నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, డి. పాపయ్యశాస్త్రి, చీమలకొండ వెంకటరమణల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తదితరుల ఆధ్వర్యంలో రథోత్సవాన్ని ప్రారంభించారు.

నేడు కొమరగిరిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు స్త్రీ నిధి సర్వసభ్య సమావేశం

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో సోమవారం ఉదయం 10 గంటలకు స్త్రీ నిధి 17వ సర్వసభ్య సమావేశం జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలోని 20 మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు ఈ సమావేశానికి తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

రేపు కృషి సఖి ఒక రోజు శిక్షణ

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో రైతు సాధికారిక సంస్థ తయారు చేసిన ప్రణాళికపై జిల్లాలోని 20 మండలాలకు చెందిన వీఓఏలకు కృషి సఖి ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై సోమవారం ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ఉంటుందన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి భరోసా

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- కోనపాపపేటలో మత్స్యకారుల ఆందోళనకు మద్దతు



మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ గీత

కొత్తపల్లి: మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని, మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు శనివారం ఆమె మద్దతు తెలిపారు. వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే పరిహారాన్ని రూ.10 వేలకు పెంచారన్నారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.10 లక్షల వరకూ బీమా సౌకర్యంతో పాటు డీజిల్ సబ్సిడీని కూడా పెంచిందన్నారు. మత్స్యకారులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. తీరంలో నిర్మిస్తున్న పరిశ్రమలకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని వేశారన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమక్షంలో పరిశ్రమ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మత్స్యకారుల అభిప్రాయం మేరకు ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇప్పటికే తీరంలో పరిశ్రమల యాజమాన్యంతో అధికారులు మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కంబాల దాసు, పల్లేటి బాపన్న దొర, ఉమ్మిడి చిన్న, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సాయి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆలయం కిటకిట

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఫాల్గుణ మాసం ఆరంభం, మాఘ మాసం ఆఖరి రోజు కావడంతో వేల సంఖ్యలో స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 4,49,611 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.